క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందనలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మార్టూరు: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 హ్యాండ్ బాల్ పోటీలలో వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎం కీర్తి ,ఎం లారెన్స్‌లు పోటీలకు ఎంపికైనట్లు వలపర్ల పీఈటీ రవి దేవరాజు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని హెచ్‌ఎం కే వెంకటేశ్వర్లు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు కే రమేష్, రవి దేవరాజు, యాకోబులు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

హైవేపై చిల్లచెట్ల తొలగింపు



హైవే వెంట జంగిల్ క్లియరెన్స్ నిర్వహిస్తున్న హైవే సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చినగంజాం: రహదారిపై చిల్ల చెట్లు పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్న కథనాలకు అధికారులు స్పందించారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'హైవే అధికారుల నిర్లక్ష్యం' అనే వార్తకు కథనానికి స్పందన లభించింది. అధికారులు హైవే వెంట రోడ్డు కిరువైపులా దట్టంగా పెరిగిన చిల్లచెట్లు, ధ్వంసమైన హెచ్చరిక బోర్డులు, బస్టాండు నిర్వాహణలో లోపాలను కథనంలో ప్రచురించింది. దీంతో అధికారులు సిబ్బంది సాయంతో ముందుగా చిల్లచెట్లను తొలిగించే పనులు చేపట్టారు. రోడ్డు ప్రమాదాలను నివారించే కార్యక్రమంలో భాగంగా చిన గంజాం జంక్షన్, ఆడిపీధిపాలెం క్రాస్ రోడ్ వద్ద జంగిల్ క్లియరెన్స్ చేశారు. కార్యక్రమంలో హైవే-216 అధికారులు రీజనల్ ఆఫీసర్ సుధీర్, సూపర్‌వైజర్ షేక్ మున్నలు తదితరులు పాల్గొని పనులను పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



అద్దంకి రూరల్: అద్దంకి పురపాలక సంఘం సాధారణ సమావేశం సోమవారం స్థానిక కౌన్సిల్ హాలులో చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ అధ్యక్షత నిర్వహించారు. అజెండాలోని 15 అంశాలను ఆర్‌ఐ అర్జున్‌రావు చదివి సభ్యులకు వినిపించారు. పురపాలక సంఘ పరిధిలోని 13,14,15 ఆర్థిక సంఘ నిధులతో పట్టణంలోని సీసీ రోడ్లు, డ్రైయిన్‌లు సంబంధించిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించారు. పారిశుధ్య విభాగంలో 25 మంది కార్మికుల పని కాలపరిమితి ముగియటంతో మళ్లీ వారిని కొనసాగించేందు వారి వేతనాలు టౌన్ లెవల్ ఫెడరేషన్ ద్వారా చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

మార్టూరు: ఖరీఫ్ సీజన్లో రైతుల కోసం డీఏపీ, యూరియా ఎరువులు స్థానిక రైతు సేవా కేంద్రాలలో సిద్ధంగా ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి వి. కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 90 ఎంటీ, డీఏపీ రూ.1350, 100 ఎంటీ. యూరియా రూ. 266.50 ధరల్లో అందుబాటులో ఉన్నాయని, వివరాల కోసం రైతులు తమ రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని ఆయన తెలిపారు. నేడు రేపు ద్రోణాదుల, చిమ్మిరిబండ గ్రామాల్లో నిర్వహించనున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



గవినివారిపాలెం గ్రామంలో అధ్వానంగా ఉన్న చెత్తకుప్పలు



రామకృష్ణాపురం గ్రామంలో ఇదీ పరిస్థితి

పొగమాటున కొట్టేశారు.. !

- ఫాగింగ్ మిషన్లను అటకెక్కించిన అధికారులు
- దోమలు విజృంభిస్తున్నా.. పట్టించుకునే వారేరి !
- రూ.26 లక్షల వరకు నిధుల డ్రా
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చీరాల టౌన్: అధికారులతో హడావుడిగా సమావేశం. సిబ్బంది ఎక్కడా లోపాలు లేకుండా పనిచేయాలి.. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం అని అధికారులు హెచ్చరిస్తూ సమావేశం ముగిస్తారు. ఇక్కడి దాకా బాగానే ఉంది. కానీ అసలు పని మాత్రం ఎక్కడా కనిపించదు. పేపర్‌లో పనులు చేయించామంటూ బిల్లులు పెట్టి అందినకాడికి దోచుకుంటూ జేబులో వేసుకుంటున్నారు అధికారులు. గ్రామాల అభివృద్ధికి సెక్రటరీలు బాధ్యతగా పనిచేయాలి. వర్షాకాలం మొదలైంది. దోమలు వ్యాప్తి చెందకుండా గట్టి జాగ్రత్తలు తీసుకోండి. ప్రజలు రోగాల బారినపడకుండా చూడాల్సిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించండని తరచూ మండల పరిషత్ అధికారులు వల్లేవేసే మాటలివే. కానీ ఆచరణలో మాత్రం వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. 15 గ్రామ పంచాయతీలు ఉన్న చీరాల మండలంలో దోమలను నిర్మూలించే ఫాగింగ్ మిషన్లు ఉన్నప్పటికి వాటిని వినియోగించకుండా అటకెక్కించారు. మండలంలోని గ్రామాల్లో ఎక్కడ చూసినా అపరిశుభ్యంతో రోడ్లు, మురుగు నీరు దర్శనమిస్తున్నాయి. చెదురుమొదురుగా వర్షాలు పడుతున్నాయి. దోమల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోకపోవటం, మురుగు నీటి కుంటల్లో దోమల మందును పిచికారీ చేయించడం లేదు. ఫలితంగా ప్రజలు రోగాల బారినపడి ఆసుపత్రుల్లో చేరుతున్న ఘటనలు అనేకం అధికంగా కనిపిస్తున్నాయి.

నిధులు మింగేసిన కార్యదర్శులు..

చీరాల మండలంలో 15 పంచాయతీల్లో ఈపూరుపాలెం, దేవాంగపురి, గవినివారిపాలెం, వాడరేవు గ్రామ పంచాయతీలు మేజర్ పంచాయతీలు. మిగిలిన 11 మైనర్ పంచాయతీలు. మండలంలో 23991 నివాస గృహాలు ఉన్నాయి. మండల జనాభా 85,696 మంది ఉన్నారు. మండలంలోని అన్నీ గ్రామాలకు ఉన్న కొద్దిపాటి నిధులను సైతం పంచాయతీ కార్యదర్శులు డ్రా చేసుకుని ఖర్చుల్లో చూపుతున్నారు. 2022 నుంచి గవినివారిపాలెం గ్రామ పంచాయతీలో ఆ కార్యదర్శి సరైన పారిశుద్ధ్య నిర్మూలన, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వకుండా, కనీసం బ్లీచింగ్ కూడా కొట్టకుండా విడతల వారీగా రూ. 26 లక్షల వరకు డ్రా చేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది.



గ్రామ పంచాయతీ కార్యాలయంలో వినియోగించకుండా మూలన చేర్చిన ఫాగింగ్ యంత్రం

తుప్పుపడుతున్న ఫాగింగ్ మిషన్లు..

విడతల వారీగా నిధులన్నీ డ్రా చేసుకున్నప్పటికి పంచాయతీలో ఏమైనా పరిశుభ్రత పనులు చేపట్టారంటే అదేమీ లేదు. గ్రామం మొత్తం అధ్వానంగా తయారైంది. నిధులన్నీ కాజేసిన ఆ పంచాయతీ కార్యదర్శిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. అలానే పలు క్లస్టర్ పంచాయతీల్లో సైతం ఇలాంటి అక్రమాలకు పాల్పడి నిధులు డ్రా చేసుకుంటున్నారే కానీ కనీసం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ప్రతి పంచాయతీకి ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేసినప్పటికి దోమలు నిర్మూలన చేయాల్సి ఉండగా మండల, గ్రామస్థాయి అధికారులు పట్టించుకోక పోవడంతో అవి మూలన చేర్చారు. దీంతో ప్రజలు రోగాలబారిన పడే అవకాశాలు ఉన్నాయి. మురుగు కాల్వల్లో, చెత్తకుప్పల్లో దోమలు ఉత్పత్తి అయి జనాలపై దాడులు చేస్తున్నాయి. దోమలు నిర్మూలన చేయాల్సిన మిషన్లు, ద్రావణం పిచికారీ చేయకుండా గ్రామాలను వదిలేశారు. గతంలో వచ్చిన డెంగీ, విషజ్వరాలకు తోటవారిపాలెం, దేవాంగపురి, రామకృష్ణాపురం గ్రామాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. అప్పట్లో హడావుడి చేసిన వైద్య, ఆరోగ్య అధికారులు, పంచాయతీ పాలకులు పక్క మండలంలో ఉన్న ఫాగింగ్ మిషన్లు తీసుకొచ్చి రెండు రోజులపాటు ఫాగింగ్ చేశారు. ఆ తర్వాత అయినా మండల అధికారులు తమ మొద్దు నిద్ర నుంచి మేల్కొనలేదు. ప్రతి పంచాయతీకి ఫాగింగ్ మిషన్ ఉన్నా పనులు చేయకుండా విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. అసలే గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా మండలస్థాయి అధికారులను కేటాయించడంతో వారి శాఖల పనులను చేస్తున్నారే కానీ కనీసం వారానికి ఒక్కసారి కూడా వారికి కేటాయించిన గ్రామాలను మొక్కుబడిగా కూడా చూసిన పాపానా పోలేదు. దీంతో కార్యదర్శులు వారికి ఇష్టం వచ్చినట్లు పనిచేస్తున్నారని, గ్రామాలను సక్రమంగా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటాం..

మండలంలో ఉన్న అన్నీ గ్రామ పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో విధిగా వారానికి రెండు, మూడు సార్లు ఫాగింగ్ చేయవచ్చు. దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవచ్చు. గ్రామాలకు ఉన్న ఫాగింగ్ మిషన్లు విధిగా వాడేలా అన్నీ పంచాయతీల కార్యదర్శులకు ఆదేశాలిస్తాం. సమస్యలన్నింటిని త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– మురళీబాపూజీ, ఈవోఆర్డీ

చీరాలను వెలుగులతో నింపండి

- కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు నిలదీత

చీరాల: కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు దాటింది. పట్టణంలో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. 33 వార్డులలో వీధి లైట్లు లేక చాలా నెలలుగా చీకట్లో మగ్గుతున్నాయని, శ్రద్ధ తీసుకుని విద్యుత్ దీపాలు వేయించాలని పలువురు కౌన్సిలర్లు చైర్మన్, కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాస రావు అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్లు పాపిశెట్టి సురేష్, మామిడాల రాములు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కీర్తి వెంకట్రావు, గుంటూరు ప్రభాకర రావులు మాట్లాడారు. మున్సిపాలిటీలో గతంలో వేసిన ఎల్‌ఈడీ లైట్లు పూర్తిగా పనికిరాకుండా పోయాయని, వాటి స్థానంలో కొత్తవి వేయాల్సి ఉండగా నిధుల కొరతతో వేయలేదన్నారు. కనీసం మామూలు ట్యూబ్‌లైట్లు వేయాలని కోరారు. ఏఈ శైలజ మాట్లాడుతూ ఎల్‌ఈడీ లైట్ల కోసం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి అనుమతులు కోరామని, ఇంకా అనుమతులు రాలేదన్నారు. వచ్చిన వెంటనే ఎల్‌ఈడీ లైట్లు వేస్తామన్నారు. తాత్కాలికంగా మూమూలు ట్యూబ్‌లైట్లు వేస్తామన్నారు. ఒక్కో ఎల్‌ఈడీ లైట్లు రూ.4 వేలు అవుతుందని, పట్టణంలో వెయ్యి వరకు అవసరం ఉందన్నారు. గ్రాంటు వస్తేనే లైట్లు వేయడం జరుగుతుందన్నారు. దొంగ తనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో అయినా వీధిలైట్లు వేయాలని కౌన్సిలర్లు కోరారు. అలానే చలికాలం కావడంతో త్వరగా చీకటి పడుతుందని, వేసవి మాదిరిగా కాకుండా సాయంత్రం 6గంటలకే వీధిలైట్లు వేయాలని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో విద్యుత్ నిర్వహణకుగాను ఏపీడీసీఈఎల్‌కు రూ.4 కోట్లు ముందుగా కేటాయించామని, వాటిని వినియోగించాలన్నారు. అన్న క్యాంటీన్‌కు మరో రూ.2 లక్షలు నిధులు కేటాయిస్తూ టెండర్లు పిలవడంపై కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు ప్రశ్నించారు. ఇప్పటికే కౌన్సిల్ నుంచి రూ.8 లక్షలు కేటాయించి అన్న క్యాంటీన్‌ను ఆధునీకరించామని, ఆ నిధులు ఏమయ్యాయని, అదనంగా మరో రూ.2 లక్షలు ఎందుకు కేటాయించాలని ప్రశ్నించారు. అనంతరం అజెండాలోని 12 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ కె.చక్రవర్తి, ఇంజినీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

సాగునీరు అందించాలని రైతుల ఆందోళన

చీరాల: చిట్టివాద పరిధిలోని పొలాలకు సకాలంలో నీరందించి రైతుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని పలువురు చీరాల చిట్టివాద రైతులు డిమాండ్ చేశారు. సోమవారం చీరాల ఆర్డీఓ కార్యాలయం ఎదుట చీరాల చిట్టివాద రైతులు ఆందోళన చేపట్టారు. పొలాలకు సకాలంలో నీరు అందించి రైతులను ఆదుకోవాలన్నారు. నరసాయపాలెం లాకుల నుంచి స్టూవర్టుపురం చానల్ మీదగా సాగునీటి విడుదలకు కూటమి ప్రభుత్వం రూ.9 లక్షల గ్రాంటును విడుదల చేసినప్పటికి వ్యర్థాలను తొలగించకుండా కాంట్రాక్టర్ పనులను సగంలో వదిలివేశారని రైతులు ఆరోపించారు. సాగుకు నీరు విడుదల చేశాక కాలువలకు గండ్లు పడ్డాయనే నెపంతో సాగునీటిని నిలిపివేయడంతో పంట సాగులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికే నార్లు పోయడంతో సకాలంలో నీరు అందకపోతే ఎకరాలకు వేల రూపాయల మేర నష్టం వాటిల్లుతుందన్నారు. దీనికి ఇరిగేషన్ ఇంజనీరులే బాధ్యత వహించాలన్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య తీవ్రతను గుర్తించి సాగునీటిని సకాలంలో అందించి సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న చిట్టివాద రైతులు

విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక

చీరాల: విశ్వహిందూ పరిషత్ సేవలను బాపట్ల జిల్లా వ్యాప్తంగా విస్తృతం చేసే క్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గ శాఖలను బలోపేతం చేస్తున్నామని బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జ్ఞానసత్య ప్రతాప్, శివన్నారాయణలు అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ కమిటి సభ్యుల సమావేశం సోమవారం జరిగింది. చీరాల శాఖ గౌరవాధ్యక్షుడిగా వెంకటరమణారావు, అధ్యక్షుడిగా చలువాది శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా మల్లికార్జునరావు, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీగా మహేష్‌బాబు, శ్రీనివాస్, ట్రెజరర్‌గా శేషసాయిలను ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియను సభ్యులు కాకర్ల వెంకటేశ్వర్లు, సాంబశివయ్య తదితరులు పర్యవేక్షించారు.



విశ్వహిందు పరిషత్ చీరాల శాఖ నూతన కార్యవర్గం

నాటక రంగంలో ఏడుకొండలుకు డాక్టరేట్

చినగంజాం: నాటక రంగంలో ప్రతిభ చూపిన మద్దిన ఏడుకొండలకు తమిళనాడుకు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇటీవల తమిళనాడు రాష్ట్రం హోసూర్‌లోని హిల్స్ హోటల్ నందు నిర్వహించిన పీహెచ్‌డీ ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. సాహిత్యం, కళారంగంలో అందజేసే పీహెచ్‌డీని ఆయన యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ చేరల ప్రకాష్ చేతుల మీదుగా అందుకున్నారు. బాపట్ల జిల్లా చినగంజాం మండలం పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డిగొల్ల పాలెంనకు చెందిన మద్దిన ఏడుకొండలు ఆల్ ఇండియా కళారంగంలో సభ్యుడు. ఆయన ఇప్పటివరకు పలు నాటకాలను ప్రదర్శించాడు. ఏడుకొండలు సత్య హరిశ్చంద్ర, వీరబ్రహ్మేంద్ర స్వామి వంటి వందలాది నాటకాలలో పలు పాత్రలు పోషించి ప్రేక్షకులను రంజింపచేశాడు. ఆవులదొడ్డి గొల్లపాలెం గ్రామంలో వ్యవసాయ రైతు కుటుంబానికి చెందిన మద్దిన వెంకటేశ్వర్లు, బొందమ్మ కుమారుడు ఏడుకొండలు నాటక రంగంలో పీహెచ్‌డీ సాధించడంపై గ్రామ పెద్దలు, కళాకారులు అభినందనలు తెలియజేశారు.



డాక్టరేట్ అందుకుంటున్న మద్దిన ఏడుకొండలు

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు

చినగంజాం: జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు మండలంలోని అడివీధిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎం మాధవీ లత తెలిపారు. బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. అడివీధిపాలెం పాఠశాల విద్యార్థులు అండర్ 14 కబడ్డీ బాలికలలో డీ యామిని, వీ యామిని, అండర్-17 కబడ్డీ బాలికలలో ఆర్ దీపిక, వీ జ్యోత్స్న, బాలురలో కే చంద్రశేఖర్ రెడ్డి, యోగాలో అండర్-14 బాలికలలో కే లావణ్య, డీ నిహారిక, బాలురలో డీ ప్రమోద్‌కుమార్, పీ సుబ్బయ్యలు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా జిల్లా స్థాయిలో మేదరమెట్లలో నిర్వహించే పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు బీ లలిత, సిబ్బంది అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

అంగన్‌వాడీలో ఉద్యోగాలకు దరఖాస్తులు



వేటపాలెంలోని సీడీపీవో కార్యాలయం

వేటపాలెం ప్రాజెక్టు పరిధిలో ఖాళీల వివరాలు..		
చీరాల మున్సిపాలిటీ పరిధి	చిన్నజాలమ్మ చెట్టు వద్ద	ఓసీ
చీరాల రూరల్ పరిధి	సాయినగర్	బీసీ-బీ
చీరాల రూరల్ పరిధి	బోయినవారిపాలెం	బీసీ-డీ
చీరాల రూరల్ పరిధి	బుర్లవారిపాలెం	బీసీ-డీ
చీరాల రూరల్ పరిధి	ఓడరేవు	బీసీ-ఏ
వేటపాలెం మండల పరిధిలో..		
దేశాయిపేట	ఆబోదినగర్	బీసీ-బీ
దేశాయిపేట	విఘ్నేశ్వరకాలనీ	బీసీ-బీ
దేశాయిపేట	నవజ్యోతికాలనీ	ఎస్టీ
కొత్తపేట	బజ్జార్ కాలనీ	ఎస్టీ
పందిళ్లపల్లి	లక్ష్మీపురం	బీసీ-బీ

వేటపాలెం: స్థానిక వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వేటపాలెం, చీరాల రూరల్, చీరాల టౌన్ మండలాల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సమగ్ర శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి ఇన్‌చార్జి, వేటపాలెం ప్రాజెక్టు సీడీపీవో ఉమా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ ఆయా ఉద్యోగానికి ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తు చేసుకోనే అభ్యర్థి ఆదే గ్రామ పరిధిలో నివసించి వివాహమై ఉండాలి. అభ్యర్థి వయస్సు 2024 జులై 1 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్లలోపు ఉండాలి. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 10న ఆఖరు తేదీగా ప్రకటించారన్నారు. దరఖాస్తులను ఐసీడీఎస్ కార్యాలయం పనిచేసే వేళల్లో అందజేయాలని తెలిపారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు ప్రాజెక్టు పరిధిలోని బల్లికురవ మండలంలో అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంతమాగులూరు సీడీపీవో డి. సుధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్లికురవ మండలంలోని కొండాపాలెం జనరల్, కొప్పెరపాడు జనరల్, కూకట్లపల్లి ఎస్టీ, వేమవరం బీసీ కాలనీ బీసీ-ఏకు కేటాయించినట్లు తెలిపారు.

కారంచేడు: మండలంలోని స్వర్ణ సెక్టార్ పరిధిలో కేశవరప్పాడు గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలి పోస్టులకు అర్హుల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు ఐసీడీఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీఓ తిరుమల శెట్టి ఝాన్సీ ఒక ప్రకటన విడుదల చేశారు. కేశవరప్పాడు గ్రామంలోని కోడ్ నంబర్ 0813126లో కార్యకర్త, సహాయకురాలి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఓసీ కులానికి చెందిన అర్హులు అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. ఈనెల 1వ తేదీ ఉదయం నుంచి 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు మాత్రమే ఇంకొల్లు కార్యాలయంలో అర్జీలు అందించాలన్నారు. కార్యకర్తలకు 10వ తరగతి పాస్, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. అదే గ్రామానికి చెందిన 21-35 సంవత్సరాల్లోపు మహిళలై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు ఇంకొల్లు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఐసీడీఎస్ పరిధిలో..

చినగంజాం: ఇంకొల్లు ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీలో ఖాళీలు ఉన్నాయని సీడీపీవో ఝాన్సీ పేర్కొన్నారు. కారంచేడు మండలం స్వర్ణ సెక్టార్‌లో కేశవరప్పాడు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త (ఓసీ), సహాయకురాలు (ఓసీ), చినగంజాం మండలం సంతరావూరు సెక్టార్‌లో కడవకుదురు-4 అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలు (ఓసీ), ఇంకొల్లు మండలం ఇంకొల్లు సెక్టార్‌లో గొల్లపాలెం -2 అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలు (ఎస్సీ), చింతలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలు (ఓసీ), ఇంకొల్లు 1 అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలు (బీసీ-ఏ), ఇంకొల్లు 2లో సహాయకురాలు (ఓసీ ఈడబ్ల్యూఎస్), ఇడుపులపాడు సెక్టార్‌లో సూదివారిపాలెం-1 అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలు (ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఈనెల 1 వ తేదీ ఉదయం 10 గంటలు నుండి 10 వ తేదీ సాయంత్రం 5.30 గంటల్లోపు ఇంకొల్లు అంగన్ వాడీ కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలని పూర్తి వివరాలకు కార్యాలయం నందు సంప్రదించాలని కోరారు.

- పర్చూరు మండలంలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పర్చూరు సీడీపీఓ సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చిన్ననందిపాడులో అంగన్వాడీ కార్యకర్త, వీరన్నపాలెం, పర్చూరు, దేవరపల్లి గ్రామాల్లో అంగన్వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె తన ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను పర్చూరు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలని వినతి



కొండమూరు పొలాల్లోకి వెళ్లేందుకు దారి

జే.పంగులూరు: మా పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేక 50 ఏళ్ల నుంచి ఇబ్బంది పడుతున్నామని.. అధికారులు తక్షణమే మా భూముల దగ్గరకు వెళ్లేందుకు దారి చూపాలని కొండమూరు గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. కొండమూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 215-216లలో సుమారు 100 ఎకరాల భూమి 30 మంది రైతులకు ఉందన్నారు. ఈ భూముల్లోకి రైతులు వెళ్లాలంటే దారి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత 50 సంవత్సరాలుగా వేరే వారి భూమిలో గుండా పొలాలకు వెళ్తున్నారు. అయితే అప్పుడు కూడా మూసివేశారు. దీంతో రైతులు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. ఈభూముల పక్కన సర్వే నంబర్ 162లో ఉన్న ప్రభుత్వ భూమి ప్రస్తుతం కొంత మంది ఆక్రమణలో ఉందని, వారి ఆక్రమణ నుంచి ప్రభుత్వ భూమిని తీసి, రోడ్డు నిర్మించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కుంచాల వెంకట్రావు, జి సుబ్బారావు, ఏడుకొండలు, సుంకర ఆదిలక్ష్మి, సాంబయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళా కమిటీ మెంబర్‌గా సుశీల



వేటపాలెం: పందిళ్లపల్లికి చెందిన శాంతి నికేతనం మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి సుశీలను జిల్లా మహిళా కమిటీ మెంబర్‌గా ఎన్నుకున్నారని పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రతి వెంకట సుబ్బారావు సోమవారం తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నుంచి సుశీలకు ఉత్తర్వులు అందాయని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళలపై జరిగే వేధింపులకు నివారణకు జిల్లా కమిటీని ఏర్పాటు చేశారన్నారు. 30 ఏళ్లుగా మహిళల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న సుశీలను గుర్తించి ఎన్జీవో సంస్థ కమిటీలో సభ్యురాలుగా చేర్చడంపై ధన్యవాదాలు తెలిపారు.

నేడు పర్చూరులో రక్తదాన శిబిరం

పర్చూరు (చినగంజాం): పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేడు మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక రోటరీ భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి రక్తదాన శిబిరం నిర్వహిస్తారని ప్రకటనలో చెప్పారు.

యద్దనపూడి ఎంపీడీఓగా అఖీబ్ జావెద్



యద్దనపూడి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా షేక్ మహ్మద్ అఖీబ్ జావెద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మన్యం జిల్లా పార్వతిపురం మండలంలో పనిచేస్తూ ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన కృష్ణకుమారి బదిలీపై నరసరావుపేట ఎంపీడీఓగా వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన షేక్ మహ్మద్ అఖీబ్ జావెద్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సత్వరమే అందేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఎంపీడీఓను కలిసి అభినందనలు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

అద్దంకి రూరల్: వాకింగ్ వెళ్తున్న మహిళ మెడలోని బంగారపు గొలుసుకు గుర్తు తెలియని వ్యక్తులు లాక్కొని వెళ్లిన ఘటన సోమవారం సాయంత్రం అద్దంకిలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. అద్దంకికి చెందిన పద్మావతి అనే మహిళ సోమవారం సాయంత్రం వేలమూరిపాడు రోడ్డులో వాకింగ్ చేస్తుంది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బైకు మీద వస్తూ మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. ఈఘటనపై మహిళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో దర్యాప్తు చేపట్టారు.

పొలం దున్నాడని దాడిపై కేసు

అద్దంకి రూరల్: తన పొలం దున్నాడన్న అనుమానంతో అల్లుడు మామపై దాడి చేశాడు. ఈఘటన బొమ్మనంపాడు గ్రామంలో జరగ్గా కేసు నమోదు చేశామని ఎస్సై ఖాదర్ బాషా పేర్కొన్నారు. ఎస్సై వివరాల మేరకు.. మండలంలోని బొమ్మనంపాడు గ్రామానికి చెందిన ఏనుగంటి పాపారావు వ్యవసాయం చేస్తుంటాడు. తన పొలం పక్కనే వరుసకు అల్లుడైన యడ్లపల్లి కాశీనాథ్ పొలం కూడా ఉంది. పాపారావు పొలం దున్నే సమయంలో కాశీనాథ్ పొలం కూడా దున్నాడన్న అనుమానంతో ఆదివారం పాపారావుపై గొడవకు దిగాడు. చుట్టుపక్కల వారు వచ్చిసర్ది చెప్పి పంపిచారు. అయినా మళ్లీ వెంటనే వచ్చి సమీపంలో ఉన్న చెట్టు నరికే కత్తి తీసుకుని పాపారావుపై దాడికి దిగాడు. ఈక్రమం పాపారావు చేతికి గాయాలయ్యాయి. అనంతరం చికిత్స కోసం పాపారావును ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు